
# ప్రజా మాటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు

ప్రచురణ : జగిత్యాల సంపుటి : 05 సంచిక : 181 పేజీలు : 04 వెల రూ. 2 శనివారం 03 - 01 - 2026

కేబీఆర్ పార్క్ చుట్టూ ఫ్లైఓవర్లకు గ్రీన్ సిగ్నల్..
పనులకు జీహెచ్ఎంసీ సిద్ధం

# మూసీకి మహర్దశ..

- రూపురేఖలు మార్చే బృహత్ ప్రణాళిక
- ప్రకటించిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- మూసీ నదిలో ఏడాదంతా నీళ్లు ప్రవహించడానికి ప్రణాళికలు
- మూసీ పునరుజ్జీవనానికి ప్రభుత్వ కార్యాచరణ.. మార్చి 31 డెడ్‌లైన్
- తెలంగాణ అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడిన సీఎం
- శాసనసభలో మూసీ పరివాహక ప్రాంతాల అభివృద్ధిపై చర్చ
- ప్రాజెక్టుకు ఏడీబీ రూ.4 వేల కోట్ల రుణం.. గోదావరి జలాల తరలింపు
- గండిపేట నుంచి గౌరెల్లి వరకు 55 కి.మీ. ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం
- బాపూఘాట్‌లో ప్రపంచంలోనే ఎత్తైన గాంధీ విగ్రహం ఏర్పాటుకు ప్రణాళిక
- హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం



హైదరాబాద్ మహానగర అభివృద్ధిలో అత్యంత కీలకమైన మూసీ నది పునరుజ్జీవనంపై తెలంగాణ ప్రభుత్వం పూర్తిస్థాయిలో దృష్టి సారించింది. మార్చి 31వ తేదీలోగా ప్రాజెక్టు అంచనాలు పూర్తి చేసి, టెండర్లు పిలవడం ద్వారా అభివృద్ధి పనులను ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా వెల్లడించారు. శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో ఈ అంశంపై జోక్యం చేసుకున్న సీఎం, మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్‌కు సంబంధించిన ప్రభుత్వ విస్తృత లక్ష్యాలను, ప్రణాళికలను సభ్యులకు వివరించారు.ఈ బృహత్ ప్రాజెక్టు కోసం ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఏడీబీ) రూ.4 వేల కోట్ల రుణం ఇచ్చేందుకు సూత్రప్రాయంగా అంగీకరించిందని, కేంద్రం నుంచి కూడా అవసరమైన అనుమతులు లభించాయని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రాజెక్టులో భాగంగా గోదావరి నుంచి 20 టీఎంసీల నీటిని తరలించి, అందులో 15 టీఎంసీలను - మిగతా 2 లో

## కవిత ప్రస్తుతం బీఆర్ఎస్‌లో ఉన్నారా లేదా



- తెలంగాణ రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి
- కేసీఆర్‌కు దగ్గరగా ఉన్న నేతలను దూరం చేసేలా కవిత మాట్లాడుతున్నారు
- కవిత ప్రస్తుతం బీఆర్ఎస్‌లో ఉన్నారా లేదా అనే విషయం వెల్లడించాలన్న మంత్రి
- కేసీఆర్‌ను విమర్శిస్తే స్పందించిన కవిత, హరీశ్ రావుపై విమర్శలకు స్పందించలేదని వ్యాఖ్య
- కేసీఆర్ వదిలిన రాజకీయ బాణంగా కవిత ఉన్నారన్న కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

కవిత ప్రస్తుతం కేసీఆర్‌కు సన్నిహితంగా ఉన్న బీఆర్ఎస్ నాయకులందరినీ దూరం చేసే ధోరణిలో మాట్లాడుతున్నారని తెలంగాణ రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. కేసీఆర్ రోజూ అసెంబ్లీకి వస్తే బీఆర్ఎస్ పుంజుకుంటుందన్న కవిత వ్యాఖ్యలు ఆమె రాజకీయ భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. అసెంబ్లీ లాబీల్లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, కవిత ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీలో ఉన్నారో లేదో - మిగతా 2 లో

## హైదరాబాద్ శివారులో దట్టమైన పొగమంచు.. స్తంభించిన ట్రాఫిక్

- హైదరాబాద్ శివారు ప్రాంతాలనుద
- కమ్మేసిన దట్టమైన పొగమంచు
- ముందు వెళ్లే వాహనాలు కనిపించక ఇబ్బందులు పడ్డ డ్రైవర్లు
- శంషాబాద్ హైవేపై 10 కిలోమీటర్ల మేర నిలిచిపోయిన ట్రాఫిక్
- విజయవాడ జాతీయ రహదారిపై లైట్ల
- వెలుతురులో వాహనాల రాకపోకలు



2 లో


## ఏపీ, తెలంగాణ మధ్య నీటి పంచాయితీల కోసం ప్రత్యేక కమిటీ



- ఏపీ, తెలంగాణ మధ్య నదీ జలాల వివాదాల పరిష్కారానికి కేంద్రం కమిటీ
- సీడబ్ల్యూసీ ఛైర్మన్ నేతృత్వంలో పనిచేయనున్న నిపుణుల బృందం
- గతేడాది జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో దీనిపై నిర్ణయం
- కృష్ణా జల వివాదాల ట్రైబ్యునల్-2 గడువును పొడిగించిన కేంద్రం
- పెండింగ్ ప్రాజెక్టులు, నీటి పంపిణీపై కమిటీ సమగ్ర అధ్యయనం

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య దశాబ్దకాలంగా కొనసాగుతున్న కృష్ణా, గోదావరి నదీ జలాల వివాదాల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ఓ ఉన్నతస్థాయి నిపుణుల కమిటీని ఏర్పాటు చేస్తూ కేంద్ర జల్‌శక్తి మంత్రిత్వ శాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.కేంద్ర జలవనరుల సంఘం (సీడబ్ల్యూసీ) ఛైర్మన్ ఈ కమిటీకి అధ్యక్షత వహిస్తారు. - మిగతా 2 లో

## ప్రజానాడి




# తిరుమలలో పోటెత్తిన భక్తులు

- సామాన్యులకు వైకుంఠ ద్వార దర్శనం
- ప్రశాంతంగా శ్రీ వేంకటేశ్వరస్వామి వైకుంఠ ద్వార దర్శనం
- వేకువజామున తిరుప్పావై సేవ అనంతరం సర్వదర్శనాలు ప్రారంభం
- పెద్దసంఖ్యలో తరలివస్తున్న భక్తులు
- మొదటి 3 రోజులు ఎస్ఎస్‌డీ టోకెన్లు కలిగిన వారికి ప్రాధాన్యతనిచ్చిన టీటీడీ నేరుగా వచ్చిన భక్తులను అనుమతి
- ఆక్టోపస్ భవనం పాయింట్ నుంచి నారాయణగిరి ఉద్యానవనంలోని క్యూలైన్ల ద్వారా భక్తులను వైకుంఠం క్యూకాంప్లెక్స్-2 లోని కంపార్ట్‌మెంట్లకు తరలివస్తున్నారు



తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వైకుంఠ ద్వార దర్శనం ప్రశాంతంగా సాగుతోంది. మొదటి 3 రోజులు ఎస్ఎస్‌డీ టోకెన్లు కలిగిన వారికి ప్రాధాన్యతనిచ్చిన టీటీడీ నుంచి నేరుగా వచ్చిన భక్తులను అనుమతిస్తోంది. వేకువజామున తిరుప్పావై సేవ అనంతరం సర్వదర్శనాలు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో శ్రీవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివస్తున్నారు. ఆక్టోపస్ భవనం పాయింట్ నుంచి నారాయణగిరి ఉద్యానవనంలోని క్యూలైన్ల ద్వారా భక్తులను వైకుంఠం క్యూకాంప్లెక్స్-2 లోని కంపార్ట్‌మెంట్లకు తరలివస్తున్నారు.ఎలాంటి టోకెన్లు లేకుండా వైకుంఠద్వార దర్శనానికి - మిగతా 2 లో

# పల్లె పండగ 2.0

## రూ. 6,700 కోట్లతో అభివృద్ధి పనులు

- గ్రామాల్లో 8వేల కిలోమీటర్ల రహదారులు
- 25వేల మినీ గోకులాలు, 58 కిలోమీటర్ల మ్యాజిక్ డ్రెయిన్లు
- రూ.1,005 కోట్లతో గిరిజన గ్రామాలకు రహదారులు
- 22,500 మినీ గోకులాలు, 15 వేలకు పైగా నీటి తొట్టెలు, లక్షకు పైగా నీటి కుంటలు పనులు చేపట్టామని పవన్ వివరించారు
- సాస్కీ పథకం ద్వారా కేంద్రం ప్రభుత్వం రూ.2,000 కోట్ల నిధులు సమకూర్చిందని ఒక ప్రకటనలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ వివరించారు
- ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్



పల్లెపండగ 1.0 కార్యక్రమం ద్వారా గ్రామాల్లో 4,300 కిలోమీటర్ల రహదారుల పనులు పూర్తి చేశామని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు. 22,500 మినీ గోకులాలు, 15 వేలకు పైగా నీటి తొట్టెలు, లక్షకు పైగా నీటి కుంటలు పనులు చేపట్టామని ఆయన వివరించారు. పల్లెపండగ 2.0లో భాగంగా రూ.6,700 కోట్లతో 53,382 అభివృద్ధి పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. 8,000 కిలోమీటర్ల మేర రోడ్లు, మరో 25,000 మినీ గోకులాలు, 58 కిలోమీటర్ల మ్యాజిక్ డ్రెయిన్లు నిర్మించనున్నామని ఉప ముఖ్యమంత్రి తెలిపారు.సాస్కీ పథకం ద్వారా కేంద్రం ప్రభుత్వం రూ.2,000 కోట్ల నిధులు సమకూర్చిందని ఒక ప్రకటనలో ఆయన వివరించారు. "పీఎం జన్‌మన్, ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో పాటు రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో రూ.1,005 కోట్ల వ్యయంతో 635 గిరిజన గ్రామాలను అనుసంధానిస్తూ - మిగతా 2 లో

# చంద్రబాబు మౌనంగా ఉండడం దారుణం

- ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల
- ఉపాధి హామీపై కేంద్రం కుట్ర పన్నుతోందని షర్మిల ఆరోపణ
- సీఎం చంద్రబాబు ఏమీ మాట్లాడడం లేదంటూ తీవ్ర విమర్శలు
- 'జీ రామ్ జీ' చట్టంతో రాష్ట్రంపై రూ.4,500 కోట్ల భారం పడుతుందని వెల్లడి
- మోదీ చేతిలో చంద్రబాబు తోలుబొమ్మలా మారారంటూ ఘాటు వ్యాఖ్యలు
- కొత్త చట్టాన్ని రద్దు చేసేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలని కూటమికి డిమాండ్



ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వంపైనా, కేంద్రంలోని ఎన్డీయే సర్కారుపైనా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై కేంద్రం కుట్రలు చేస్తుంటే, సీఎం చంద్రబాబు మౌనంగా ఉండటం దారుణమని ఆమె మండిపడ్డారు. బీజేపీ తెస్తున్న నల్ల చట్టాలకు రాష్ట్ర ప్రభుత్వం చప్పట్లు కొట్టడం అత్యంత సిగ్గుచేటని విమర్శించారు.షర్మిల మాట్లాడుతూ, "గ్రామీణ ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ఉపాధి హామీ పథకం ఊతమిచ్చింది. వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో దేశంలోనే తొలి జాబ్ కార్డును మన రాష్ట్రంలోనే అందించాం. ఈ పథకం ద్వారా ఏటా 80 లక్షల మంది పేదలకు - మిగతా 2 లో

# సంపాదకీయం

## ఆరావళి..ఆశ



ఆరావళిని రక్షించుకోవడమంటే, ఊపిరాడక ఉక్కిరిబిక్కిరి అవుతున్న దేశరాజధాని వాసులకు కాస్తంత ఆక్సిజన్ అందించడం. ఢిల్లీ ఇరుగుపొరుగు రాష్ట్రాలను పర్యావరణ విధ్వంసం నుంచి రక్షించడం. 250కోట్ల సంవత్సరాల నాటి ఆరావళిని అవలీలగా మింగేయడానికి మైనింగ్ మాఫియా చుట్టూ కాచుకుకూర్చున్నదని తెలుసుగనుకనే, నిర్వచనం విషయంలో సుప్రీంకోర్టు అంతపట్టుదలగా ఉంది. మాటలో ఏమాత్రం తేడావచ్చినా, పర్వతాలు ఫలహారం చేయడానికి అవకాశం ఇచ్చినట్టు అవుతుందని దాని భయం. వందమీటర్లకంటే ఎక్కువ ఎత్తున్న కొండలనే పర్వతాలుగా పరిగణించాల ంటూ కేంద్రం ఇచ్చిన నిర్వచనాన్ని గతంలో తెలిసోతెలియకో ఆమోదించిన సర్వోన్నత న్యాయస్థానం ఇంతవెంటనే తప్పు సరిదిద్దుకొని, అప్పటి ఉత్తర్వులను ఉపసంహరించుకున్నందుకు సంతోషించాలి. ఇంత ఎత్తుదాటితేనే అనడంతోనే 95శాతం ఆరావళి అతివేగంగా అంతరించిపోతుందని పర్యావరణవేత్తల భయం. పర్యావరణ మంత్రిత్వశాఖ నిర్వచనాన్ని గతనెలలో మాజీ చీఫ్‌జస్టిస్ గవాయ్ ఆమోదించగానే వారంతా భయపడ్డారు. ఆరావళిలో అక్రమమైనింగ్‌కు వ్యతిరేకంగా పోరాడి, కష్టపడి సాధించిన రక్షణలన్నీ గాలికికొట్టుకుపోవడం బాధకలిగించింది. మరోపక్క దేశరాజధాని కాలుష్యంలో కొట్టుమిట్టాడుతూ ఊపిరాడని స్థితిలో ఉండటం కూడా ప్రజల్లో ఈ నిర్వచనం మీద అవగాహనకు దోహదం చేసింది. ఇటువంటి అంశాల్లో పెద్దగా చొరవచూపని సామాన్యులు సైతం ఆరావళి పరిరక్షణ ఉద్యమంలో చురుకుగా పాల్గొనడం, ప్రధాన మీడియాలోనే కాక, సామాజిక మాధ్యమాల్లో సైతం 'సేవ్ ఆరావళి' అంటూ ప్రచారాలు, చర్చలు జరగడం బాగుంది. ప్రస్తుత సీజేఐ సూర్యకాంత్ ఆధ్వర్యంలోని త్రిసభ్యధర్మాసనం ఈ అంశాన్ని త్వరితంగా స్వీకరించి, నిపుణుల కమిటీ సూచనలను అహేతుకమైనవిగా భావించి, మరింత సమగ్రమైన అధ్యయనాన్ని కోరుతూ అమలు నిలిపివేయడం సముచితం.2010లో రాజస్థాన్ ముందుకు తెచ్చిన వందమీటర్ల ఎత్తునిర్వచనం చాలా రాష్ట్రాలకు నచ్చింది. అధికారికంగానో, అనధికారికంగానో అమలు చేసి అస్మదీయులకు ఎన్నోమేళ్ళు చేసుకున్నాయి. మరో ఎనిమిదేళ్ళకు రాజస్థాన్‌లో ఎఫ్‌ఎస్ఐ చేపట్టిన సర్వేలో అనేక కొండలు ఈ నిర్వచనంలో భాగంగా మాయమైపోయినట్టు తేలింది. ఆరావళిని ఇంతవరకూ ఎవరూ తాకలేదని, తవ్విపోయలేదనీ, ఇప్పుడే దానికి ప్రమాదం ముంచుకొస్తున్నదన్న భ్రమ ఎవరికీ లేదు. కొండలను దోచేస్తున్న కార్పొరేట్ల ధనదాహానికి ఇటువంటి నర్మగర్భమైన, కుట్రపూరిత నిర్వచనాలు మరింత తోడవుతాయన్నది సత్యం. ఆరావళికి దూరంగా కూడా మైనింగ్ పూర్తిగా నిలిపివేస్తున్నట్టుగా, కొత్తగా అనుమతులు ఇవ్వనట్టుగా ప్రభుత్వాలు ఈ మధ్యలో చేసిన విన్యాసాలు సైతం ప్రజలు గమనించారు. వాయువ్యభారతానికి వందలాది కిలోమీటర్ల రక్షణకవచంగా ఉన్న ఆరావళిలో ఇప్పటికే పోయింది ఎంతో తెలుసు కనుక, ఉన్నదానినైనా నిలబెట్టుకోవాలని తాపత్రయపడ్డారు. పర్వతాలను, నదులను యథాస్థితిలో రక్షించుకోవడం కాక, వాటి ఎత్తులు, లోతులు కొలిచి, కొత్తనిర్వచనాలు సృష్టించి అంతిమంగా మాయం చేయడానికి జరుగుతున్న కుట్రను జనం గ్రహించారు.అభివృద్ధి పేరిట పారిశ్రామికవేత్తలకు వ్యవసాయభూములనుంచి అడవులవరకూ అన్నీ అప్పనంగా అప్పగించేస్తున్న కాలమిది. అడవులు అంతరించిపోయి, పర్యావరణం నాశనమై, ప్రకృతి ప్రకోపానికీ, కాలుష్యానికీ సామాన్యుడు బలైపోతున్నాడు. కాలుష్యం కమ్మేస్తున్న తొలిపదినగరాల్లో మనదేశంలోనివి అరడజనున్నాయి. ఢిల్లీకాలుష్యాన్ని చక్కదిద్దలేక చేతులెత్తేసిన పాలకులు కాలుష్యం నిర్వచనాలను మార్చడానికీ, గ్రేడ్లు తారుమారుచేయడానికీ ప్రయత్నిస్తున్నారు. కాలుష్యంతో కొత్త రోగాలు రావని పార్లమెంటులోనే సమర్థించుకుంటున్నారు. క్విడ్‌ప్రోకో పద్ధతిలో మనుగడసాగిస్తున్న రాజకీయవ్యవస్థకు కఠిన పర్యావరణ పరిరక్షణచట్టాలతో ప్రజలను రక్షించే ఉద్దేశం ఏమాత్రం లేదు. అధికారపక్షానికి అధికారికంగానే భూరి విరాళాలు అందుతూ, ప్రతిగా ఆయా సంస్థలకు ఎన్నెన్నిమేళ్ళు జరుగుతున్నాయో చూస్తూన్నాం. ఎప్పటికప్పుడు పాలకులను ప్రశ్నిస్తూ, న్యాయస్థానాలను నమ్ముకుంటూ, భవిష్యత్ తరాలకోసం ఆరావళి తరహాలో ప్రతీ కొండనీ గుట్టనీ జనమే కాపాడుకోక తప్పదు. ఆరావళి ఒక్కటేనా, హిమాలయాలు, వింధ్య, పశ్చిమకనుమలతో సహా ప్రతీ పర్వతమూ, నదీ ఎన్నడూలేనంత ప్రమాదంలో మునిగి, మనుగడకోసం అల్లాడుతున్నాయి.

## చంద్రబాబు మౌనంగా ఉండడం దారుణం

**మొదటిపేజీ తరువాయి** – ఉపాధి హక్కుగా మారింది" అని వెల్లడించారు. దేశంలోనే ఈ పథకాన్ని సమర్థంగా వినియోగించుకుంటున్న రాష్ట్రాల్లో ఏపీ అగ్రస్థానంలో ఉందని తెలిసినా, కేంద్రం 'జీ రామ్ జీ' పేరుతో కొత్త చట్టం తీసుకొచ్చి దానికి గండి కొడుతోందని ఆరోపించారు. ఈ అక్రమ చట్టంతో రాష్ట్రంపై ఏటా రూ.4,500 కోట్ల భారం పడుతుందని, ఈ నిజాన్ని తెలిసి కూడా చంద్రబాబు ఏమీ మాట్లాడకుండా ఉండడం బాధాకరమన్నారు."గోరుచుట్టుపై రోకలి పోటులా ఈ కొత్త చట్టం మారింది. ఇప్పటికే ప్రతినెలా జీతాలు ఇవ్వడానికే అప్పులు చేసే ప్రభుత్వం, ఈ పథకానికి అవసరమైన 40 శాతం నిధులను ఎక్కడి నుంచి తెస్తుంది?" అని షర్మిల ప్రశ్నించారు. నిరుద్యోగంలో నంబర్ వన్ గా ఉన్న రాష్ట్రంలో ఉపాధికి ఉరి పెడుతుంటే ప్రజలకు ఏం సమాధానం చెబుతారని నిలదీశారు. "మీరు రాష్ట్రానికి ముఖ్యమంత్రా లేక మోదీ చేతిలో తోలుబొమ్మనా?" అని చంద్రబాబును ఉద్దేశించి ఆమె ఘాటుగా వ్యాఖ్యానించారు.ఉపాధి హామీ పథకానికి ఊపిరి తీస్తున్న 'జీ రామ్ జీ' చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని కూటమి పార్టీలను ఆమె కోరారు. పాత నరేగా చట్టాన్ని పునరుద్ధరించేలా బేషరతుగా మద్దతు పలకాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో, కూటమి పార్టీల నిర్లక్ష్యాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో ఎండగడుతుందని షర్మిల హెచ్చరించారు.

## మావోయిస్టులకు మరో ఎదురు దెబ్బ

**మొదటిపేజీ తరువాయి** – సమస్యలు, అంతర్గత గ్రూపు సమస్యలు ఇప్పటికే పార్టీని బలహీనపరిచాయి. ఈ సంక్షోభంలో మరో కీలక మావోయిస్టు నేత బర్సే దేవా ఈ రోజు తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి సమక్షంలో పోలీసుల ఎదుట లొంగిపోయారు.బర్సే దేవా మావోయిస్టు గెరిల్లా లిబరేషన్ ఆర్మీ చీఫ్‌గా పనిచేస్తూ, పార్టీ కార్యకలాపాలను పర్యవేక్షిస్తున్న నేత. ముఖ్యంగా ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు కీలక నేత హిడ్మా మరణించిన తర్వాత, పార్టీకి అవసరమైన ఆయుధాలు, వ్యూహాలు, రక్షణ కార్యకలాపాలన్నింటిని బర్సే దేవా చూసుకుంటున్నారని పోలీసులు తెలిపారు. బర్సే దేవా, హిడ్మా ఒకే గ్రామానికి చెందినవారని, దీంతో మావోయిస్టు పార్టీలో ఆయన పాత్ర మరింత కీలకమని విశ్లేషకులు చెబుతున్నారు.పోలీసులకి లొంగిన తర్వాత, బర్సే దేవా దగ్గర మౌంటెన్ ఎల్ఎంజీని స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఆయన పర్యవేక్షించిన మిలిటరీ ఆపరేషనల్ కమాండ్ సభ్యులు కూడా పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఈ పరిణామంతో, మావోయిస్టు పార్టీకి కీలకంగా నిలిచిన నాయకత్వ వ్యవస్థలో పెద్ద గ్యాప్ ఏర్పడింది.రేపు బర్సే దేవాను మీడియా ముందు ఉంచి, ఆయన లొంగిపోవడంలో వచ్చే ప్రాముఖ్యత, స్వాధీనం చేసిన ఆయుధాల వివరాలు, మిలిటరీ ఆపరేషనల్ కమాండ్ సభ్యుల గురించి డీజీపీ శివధర్ రెడ్డి అధికారికంగా వివరించనున్నారు. ఈ సంఘటన తెలంగాణలోని మావోయిస్టు ఉద్యమానికి పెద్ద దెబ్బగా భావిస్తున్నారు. గతంలో, అనేక మంది కీలక నేతలు ఎన్‌కౌంటర్‌లో మరణించడం, ఆరోగ్య సమస్యలు, పార్టీ అంతర్గత విభజనలు వంటి కారణాలతో ఇప్పటికే ఎంతోమంది సరెండర్ అయ్యారు. తాజాగా బర్సే దేవా కూడా పోలీసుల ఎదుట లొంగిపోయిన తరువాత, పార్టీ వ్యూహాలపై తీవ్ర ప్రభావం పడుతుందని విశ్లేషకులు చెబుతున్నారు. మావోయిస్టు ఉద్యమం ఇప్పటి వరకు చూసుకున్న వ్యూహాలను సరిచూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడినట్లు తెలుస్తోంది.

## ఏపీ, తెలంగాణ మధ్య నీటి పంచాయితీల కోసం ప్రత్యేక కమిటీ



**మొదటిపేజీ తరువాయి** – కృష్ణా, గోదావరి నదీ యాజమాన్య బోర్డుల (కేఆర్ఎంబీ, జీఆర్ఎంబీ) ఛైర్మన్లు, జాతీయ జల అభివృద్ధి సంస్థ (ఎన్‌డబ్ల్యూడీఏ) చీఫ్ ఇంజినీర్‌తో పాటు ఇరు రాష్ట్రాల జలవనరుల శాఖల ఉన్నతాధికారులు ఇందులో సభ్యులుగా ఉంటారు. గతేడాది జులైలో కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్ అధ్యక్షతన జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో ఈ కమిటీ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నారు. ఆ సమావేశంలో ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు పాల్గొని చర్చించారు. ఇటీవల డిసెంబర్‌లో తెలంగాణ ప్రభుత్వం తమ ప్రతినిధులను నామినేట్ చేయడంతో కమిటీ ఏర్పాటు ప్రక్రియ వేగవంతమైంది.ఇరు రాష్ట్రాల మధ్య నీటిని సమానంగా పంచడం, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు, కొత్త ప్రతిపాదనలు వంటి కీలక అంశాలపై ఈ కమిటీ సమగ్రంగా అధ్యయనం చేసి, పరిష్కార మార్గాలను సూచిస్తుంది. ఇదే సమయంలో, కృష్ణా జల వివాదాల ట్రైబ్యునల్-2 (కేడబ్ల్యూడీటీ-2) గడువును కూడా కేంద్రం 2026 జులై వరకు పొడిగించింది.

# పల్లె పండగ 2.0 - రూ. 6,700 కోట్లతో అభివృద్ధి పనులు

**మొదటిపేజీ తరువాయి** – 1,069 కిలోమీటర్ల రహదారుల నిర్మాణానికి శ్రీకారం చుట్టాం. అడవి తల్లి బాటతో కొండలపై ఉన్న గిరిజన గ్రామాలకు రోడ్లు వచ్చాయి. గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన జలజీవన్ మిషన్ కార్యక్రమం ద్వారా చిత్తూరు, పల్నాడు, ప్రకాశం, ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో రూ.7,910 కోట్లతో 5 ప్రాజెక్టుల పనులు చేపట్టాం. 2027 నాటికి వీటిని పూర్తి చేయాలన్నది లక్ష్యం. వచ్చే 30 సంవత్సరాల్లో 1.20 కోట్ల మందికి దాహార్తి తీర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. జలజీవన్ మిషన్‌కు పొట్టి శ్రీరాములు పేరిట అమరజీవి జలధారగా నామకరణం చేశాం' అని డిప్యూటీ సీఎం తెలిపారు.నంబర్ వన్ స్థానంలో: '7 జిల్లాల్లో ఉన్న 28 స్వచ్ఛరథాల సంఖ్యను మరింత పెంచనున్నాం. వీటిద్వారా ఇప్పటివరకు 2 లక్షల కిలోలకు పైగా పొడి వ్యర్థాలు సేకరించాం. గతంలో ఎన్నడూ లేని విధంగా పంచాయతీలకు స్వయం ప్రతిపత్తితో పాటు 10 వేల మంది ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాం. 77 డీడీవో కార్యాలయాలు ప్రారంభించాం. రికార్డు స్థాయిలో ఉద్యోగులు, ప్రజాప్రతినిధులకు శిక్షణ ఇప్పించి దేశంలో నంబర్ వన్ స్థానంలో నిలిచాం.



గ్రామీణాభివృద్ధి, పర్యాటక, అటవీ, దేవాదాయశాఖల సమన్వయంతో ఎకో, టెంపుల్ టూరిజం అభివృద్ధికి చర్యలు చేపడుతున్నాం. తెలంగాణలోని కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధిలో భాగంగా టీటీడీ సహకారంతో రూ.35.19 కోట్లతో దీక్ష విరమణ మండపం, 96 గదుల సత్రం నిర్మాణాలకు ఈ నెల 3న శంకుస్థాపన చేయనున్నాం' అని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వివరించారు.

'చిత్తూరు, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఏనుగుల బెడదను అరికట్టేందుకు తీసుకొచ్చిన కుంకీ ఏనుగులకు రాష్ట్ర పరిస్థితులకు తగిన విధంగా శిక్షణ ఇప్పించడంతో పాటు ఏఐతో ఆధునిక సాంకేతిక వ్యవస్థను అటవీశాఖకు పరిచయం చేశాం. వన మహోత్సవంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా కోటి మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాం. తీర ప్రాంత సంరక్షణకు 'గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఏపీ'కి శ్రీకారం చుట్టాం.33 శాతంగా ఉన్న గ్రీన్ కవర్‌ని 2047 నాటికి 50 శాతానికి పెంచాలని లక్ష్యంగా నిర్ణయించాం. ఎర్రచందనం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయడంతో పాటు రాష్ట్రం నుంచి అక్రమంగా తరలిపోయిన ఎర్ర చందనాన్ని వెనక్కి తెస్తాం. మానవ, వన్యప్రాణి సంఘర్షణను నిలువరించడం, గాయపడిన అటవీ జంతువుల సంరక్షణ, చికిత్స లక్ష్యంగా హనుమాన్ ఫౌండేషన్ ప్రారంభించాం. అటవీ అమరవీరుల కుటుంబాల సంక్షేమనిధికి రూ.5కోట్లు ప్రభుత్వం జమ చేసింది. అటవీ సిబ్బందిపై దాడులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నాం' అని ఉప ముఖ్యమంత్రి వివరించారు.

# మూసీకి మహర్దశ..

**మొదటిపేజీ తరువాయి** – నగర తాగునీటి అవసరాలకు, మిగిలిన 5 టీఎంసీలతో మూసీలో నిరంతరం శుద్ధమైన నీరు ప్రవహించేలా చూస్తామని స్పష్టం చేశారు.ప్రాజెక్టులో భాగంగా గండిపేట నుంచి గౌరెల్లి వరకు 55 కిలోమీటర్ల పొడవున ఎలివేటెడ్ కారిడార్ నిర్మించనున్నట్లు సీఎం చెప్పారు. దీంతో పాటు, బాపూ ఘాట్ వద్ద మూసా-ఈసా నదుల సంగమ ప్రదేశంలో 'ఎ' ఆకారంలో 'గాంధీ సరోవర్' అభివృద్ధి చేస్తామన్నారు. ఇక్కడే ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన మహాత్మా గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలనేది ప్రభుత్వ ఆలోచనగా వెల్లడించారు.మూసీ నది కాలుష్యం వల్ల పరివాహక ప్రాంతాల్లో పర్యావరణం, ప్రజల ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతింటున్నాయని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమల వ్యర్థాలు, చెత్త సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకే ఈ ప్రాజెక్టును చేపడుతున్నామని స్పష్టం చేశారు. ఒకప్పుడు నిజాం హయాంలో మూసీ తీరంలో గొప్ప అభివృద్ధి జరిగిందని, 1908 వరదల తర్వాత ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ నిర్మించారని గుర్తుచేశారు. అదే స్ఫూర్తితో ఇప్పుడు మూసీకి పూర్వవైభవం తీసుకువస్తామని అన్నారు.ప్రాజెక్టులో భాగంగా మంచిరేవుల వద్ద పురాతన శివాలయాన్ని అభివృద్ధి చేయడంతో పాటు, మూసీ తీరంలో గురుద్వారా, మసీదు, చర్చి వంటివి నిర్మించి మతసామరస్యాన్ని చాటుతామని చెప్పారు. ప్రస్తుతం కన్సల్టెన్సీల ద్వారా సమగ్ర ప్రాజెక్టు



నివేదిక (డీపీఆర్) సిద్ధం చేస్తున్నామని, అది పూర్తయిన వెంటనే శాసనసభలో సభ్యుల ముందు ఉంచి, వారి సలహాలు తీసుకుని ముందుకు వెళ్తామని సీఎం హామీ ఇచ్చారు. మూసీ పరివాహక ప్రాంతాల్లోని పేదలకు మెరుగైన నివాసాలు కల్పిస్తామని, హైదరాబాద్‌ను పర్యావరణ హిత నగరంగా, ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు.

# తిరుమలలో పోటెత్తిన భక్తులు

**మొదటిపేజీ తరువాయి** – వచ్చే సామాన్య భక్తులకు ఇబ్బందులు లేకుండా దర్శనం చేసుకొనేందుకు విస్తృత ఏర్పాట్లు చేసినట్లు టీటీడీ సీవీఎస్ఓ మురళీకృష్ణ తెలిపారు. పాచికాల్వ గంగమ్మ ఆలయం నుంచి నారాయణగిరి ఉద్యానవనంలో ఏర్పాటు చేసిన షెడ్ల వరకు దాదాపు రెండున్నర కిలోమీటర్ల మేర ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేశామని అన్నారు. తిరుమలలోని వివిధ ప్రాంతాల్లో ఉంటూ వైకుంఠ ద్వార సర్వదర్శనానికి వెళ్లాలనుకొనే భక్తులను క్యూలైన్ ప్రారంభ ప్రాంతానికి ఉచిత బస్సుల ద్వారా తరలిస్తున్నట్లు తెలిపారు. అన్నప్రసాదాలు, పాలు, నీళ్లు వంటి పానీయాలను నిరంతరం భక్తులకు అందిస్తూ దర్శనానికి అవకాశం కల్పిస్తామని సీవీఎస్ఓ వెల్లడించారు.టీటీడీ ఆధ్వర్యంలోని ట్రస్టులకు నిన్న (శుక్రవారం) రూ.20 లక్షల విరాళం అందింది. హైదరాబాద్‌కు చెందిన రైడాన్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో వంగల హర్షవర్ధన్.. శ్రీ వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్ట్ రూ.10 లక్షలు విరాళంగా అందించారు. గ్లోబల్ మ్యానుఫ్యాక్చరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ జాయింట్ డైరెక్టర్ నేలబొట్ల శుభ సౌజన్య శ్రీ బాలాజీ ఆరోగ్యం వరప్రసాదిని స్కీంనకు రూ.10 లక్షలు అందజేశారు. ఈ మేరకు రూ. 20 లక్షల డీడీలను టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడుకు ఆ సంస్థల ప్రతినిధుల తరఫున తిరుపతి బాలాజీ రైల్వే డివిజన్ సాధన సమితి కన్వీనర్ కుప్పాల గిరిధర్ కుమార్ అందజేశారు. తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారిపై అచంచలమైన భక్తితో టీటీడీ ట్రస్టులకు భక్తులు విరాళాలు అందించడం పట్ల బీఆర్ నాయుడు హర్షం వ్యక్తం చేశారు.అదేవిధంగా ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారిని భక్తులు వైకుంఠ ద్వారం



ద్వారా దర్శించుకున్నారు. 10 రోజుల పాటు కొనసాగే ఈ దర్శన భాగ్యం మంగళవారం గోవిందనామ స్మరణల మధ్య ప్రారంభమైంది. సోమవారం అర్ధరాత్రి దాటాక 12.05 గంటలకు టీటీడీ అధికారులు, అర్చకులు శ్రీవారి ఆలయం తెరచి, మూలమూర్తికి ధనుర్మాస కైంకర్యాలు పూర్తిచేశారు. అనంతరం వీవీఐపీలు, వీఐపీలకు వైకుంఠ ద్వారం మీదుగా దర్శనాలు ప్రారంభించారు. ఉదయం 7.20 గంటలకు ఈ-డిప్‌లో టోకెన్లు పొందిన భక్తులను సర్వదర్శనానికి అనుమ తించారు. ఈ పర్వదినం సందర్భంగా తిరుమాడ వీధుల్లో స్వర్ణ రథోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం 9 నుంచి 10.30 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్ప స్వామివార్లకు రథరంగ డోలోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. పెద్దసంఖ్యలో మహిళలు, భక్తులు రథాన్ని లాగారు.

## హైదరాబాద్ శివారులో దట్టమైన పొగమంచు.. స్తంభించిన ట్రాఫిక్



**మొదటిపేజీ తరువాయి** – హైదరాబాద్ శివారు ప్రాంతాలను శుక్రవారం తెల్లవారుజామున దట్టమైన పొగమంచు కమ్మేసింది. మంచు తీవ్రత ఎక్కువగా ఉండటంతో రోడ్లు, భవనాలు కనిపించని పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా నగర శివార్లలోని ఇబ్రహీంపట్నం, నాగార్జునసాగర్ హైవే, మేడ్చల్, తూంకుంట, శామీర్‌పేట, గండిపేట, మోకిల, పటాన్‌చెరు, వికారాబాద్, రాజేంద్రనగర్, ఆదిబట్ల తదితర ప్రాంతాల్లో జీరో విజిబిలిటీ నమోదైంది. దీంతో ఉదయాన్నే రోడ్లెక్కిన వాహనదారులు, ఆఫీసులకు వెళ్లే ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.పొగమంచు కారణంగా శంషాబాద్ ఎయిర్‌పోర్టు మార్గంతో పాటు బెంగళూరు జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో డ్రైవర్లు తమ వాహనాలను రోడ్డు పక్కనే నిలిపివేశారు. ఫలితంగా శంషాబాద్ నుంచి పాలమాకుల వరకు సుమారు 10 కిలోమీటర్ల మేర భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. అటు ఔటర్ రింగ్ రోడ్డుపై కూడా మంచు ప్రభావం ఎక్కువగా ఉండటంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.మరోవైపు హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై కూడా పరిస్థితి ఇలాగే ఉంది. అబ్దుల్లాపూర్‌మెట్ వద్ద పది అడుగుల దూరంలో ఉన్న వాహనాలు కూడా కనిపించనంతగా పొగమంచు కురుస్తోంది. విజిబిలిటీ పూర్తిగా తగ్గిపోవడంతో వాహనదారులు హెడ్ లైట్లు, ఇండికేటర్లు వేసుకుని నెమ్మదిగా వెళ్లాల్సి వచ్చింది. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత తగ్గే అవకాశం ఉండటంతో వాహనదారులు ప్రయాణాల్లో జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచిస్తున్నారు.

## కవిత ప్రస్తుతం బీఆర్ఎస్‌లో ఉన్నారా లేదా



**మొదటిపేజీ తరువాయి** – స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కవిత చేసిన వ్యాఖ్యలను మంత్రి తీవ్రంగా ఖండించారు. కేసీఆర్‌పై ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలకు కవిత వెంటనే స్పందించారని, కానీ హరీశ్ రావుపై చేసిన విమర్శలపై ఎందుకు మౌనంగా ఉన్నారో చెప్పాలని కోమటిరెడ్డి నిలదీశారు. ఇది చూస్తుంటే కవిత కేసీఆర్ వదిలిన రాజకీయ బాణంగా ఉన్నారని ఆరోపించారు. నల్గొండ జిల్లాకు కేసీఆర్ హయాంలో జరిగిన అన్యాయాన్ని కవిత ప్రశ్నించి ఉంటే బాగుండేదని ఆయన అభిప్రాయపడ్డారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు విషయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం తప్పు చేసిందని కవిత స్వయంగా అంగీకరించడం హర్షణీయమని మంత్రి అన్నారు. బీఆర్ఎస్ నేతలు దోచుకున్నారని కవిత స్వయంగా ఆరోపిస్తున్నారని ఆయన గుర్తు చేశారు.

# రేవంత్ రెడ్డి వ్యాఖ్యలకు నిరసనగా ఈ నిర్ణయం

**బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు**

**అసెంబ్లీ సమావేశాలను బహిష్కరించాలని నిర్ణయించినట్లు వెల్లడి**

**బీఏసీలో తీసుకున్న నిర్ణయాలకు విరుద్ధంగా సభను నిర్వహిస్తున్నారని విమర్శ**

**ముఖ్యమంత్రిని విమర్శించవద్దని చెప్పడమేమిటని స్పీకర్‌పై ఆగ్రహం**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలకు నిరసనగా అసెంబ్లీ సమావేశాలను బహిష్కరించాలని నిర్ణయించుకున్నట్లు బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు వెల్లడించారు. అదే సమయంలో స్పీకర్ తీరును వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. శాసనసభ నుంచి వాకౌట్ చేసిన అనంతరం గన్ పార్కు వద్ద పార్టీ ఎమ్మెల్యేలతో కలిసి



హరీశ్ రావు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, బీఏసీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలకు విరుద్ధంగా సభను నిర్వహిస్తున్నారని ఆరోపించారు.సభను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బూతుల మయం చేశారని ఆయన దుయ్యబట్టారు. ఆయన వ్యాఖ్యలపై నిరసన తెలిపేందుకు ప్రధాన ప్రతిపక్షంగా తమకు అవకాశం ఇవ్వాలని సభాపతిని కోరితే, ముఖ్యమంత్రిని విమర్శించవద్దని ఆయన చెప్పడం ఏమిటని ప్రశ్నించారు. ప్రధానమంత్రిని రాహుల్ గాంధీ విమర్శించడం లేదా? మరి ముఖ్యమంత్రిని విమర్శించవద్దని చెప్పడం ఏం ప్రజాస్వామ్యమని నిలదీశారు. అసెంబ్లీని గాంధీ భవన్, సీఎల్పీ సమావేశంలా రేవంత్ రెడ్డి మారుస్తున్నారని ఎద్దేవా చేశారు. తాము ప్రశ్నిస్తే అడ్డగోలుగా చిల్లర మాటలు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి ఎదుటి వారి మీద బాడీ షేమింగ్ చేస్తున్నారని, వీధి రౌడీలా మాట్లాడుతున్నారని విమర్శించారు. తెలంగాణ తెచ్చిన కేసీఆర్‌పై పదేపదే చావు మాటలు మాట్లాడుతు న్నారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి తెలంగాణ ద్రోహి అని అన్నారు. అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకులకు మైకు కూడా ఇవ్వడం లేదని ఆరోపించారు. అలాంటప్పుడు అక్కడ కూర్చున్నా ఎలాంటి లాభం లేదని వాకౌట్ చేశామని తెలిపారు. ముఖ్యమంత్రి మీద మాట్లాడితే మైక్ కట్ చేస్తానని స్పీకర్ ఆన్ రికార్డు చెప్పారని పేర్కొన్నారు.

## రోటరీ క్లబ్ ఆఫ్ జగిత్యాల సెంట్రల్, జగిత్యాల క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో

# కాసుగంటి సుధాకర్ రావు మృతికి ఘనంగా శ్రద్ధాంజలి



**జగిత్యాల జనవరి 2( ప్రజా మంటలు) :** రోటరీ క్లబ్ ఆఫ్ జగిత్యాల సెంట్రల్ మరియు జగిత్యాల క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ ఆవరణలో .....శుక్రవారం ఉదయం 11 గంటలకు విద్యావేత్త జగిత్యాల క్లబ్ మరియు రోటరీ క్లబ్ వ్యవస్థాపక సభ్యులు కాసుగంటి సుధాకర్ రావు మృతి పట్ల సంతాప సమావేశం నిర్వహించి ఆయన చిత్రపటానికి పూల మాలవేసి, రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు.ఈ కార్యక్రమంలో జగిత్యాల క్లబ్ కార్యదర్శి రాంగోపాల్ రెడ్డి, రోటరీ క్లబ్ ప్రతినిధులు మంచాల కృష్ణ సిరిసిల్ల శ్రీనివాస్, ఆంటోనీ ముత్తు, ఏవి ఎల్ ఎన్ చార, రాజు, టీవీ సూర్యం, ఈఎన్టీ వైద్యులు డాక్టర్ వెంకటేశ్వర్లు మరియు జగిత్యాల క్లబ్ ప్రతినిధులు సామ హేమందర్ రెడ్డి, ఏ. వెంకటరమణ, పి.అమిత్ కుమార్, సంజయ్ సామ్రాట్, భారతీయ నాగరికత విద్యా సమితి సంస్థ ప్రతినిధులు , తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సంతాప సమావేశంలో.. వారు స్వర్గీయ కాసుగంటి సుధాకర్ రావు సేవలను కొనియాడారు.విద్యావేత్తగా, సామాజిక వేత్తగానే కాకుండా, పారిశ్రామికవేత్తగా జగిత్యాల ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పేరొందారన్నారు.జిల్లా కేంద్రంలో శ్రీ సరస్వతి శిశు మందిర్ తో పాటు శ్రీ వాణి సహకార జూనియర్ కళాశాల పేరిట గ్రామీణ ప్రాంత విద్యార్థులకు , గోదావరి వ్యాలీ ఇండస్ట్రీస్ స్థాపించి ఎంతో మంది నిరుద్యోగులకు ఆపన్న హస్తము అందించడంతో పాటుగా వ్యవసాయదారులకు ఆధునిక పనిముట్లు తయారు చేయించడంతో వ్యవసాయదారులకు దగ్గరి బంధువ య్యారన్నారు.అంతేకాకుండా సమాజ సేవలో ముందుండి, జగిత్యాలలో రోటరీ క్లబ్ ను ప్రారంభించి, తద్వారా ఎన్నో సేవలు అందించి, సామాజికవేత్తగా సమాజంలో ముందున్నారు.ఎంతోమంది పేద విద్యార్థులకు ఉచిత విద్యను అందించడమే కాకుండా ఎన్నో సామాజిక, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో తన వంతు సహాయ సహకారాలు అందజేశారని కొనియాడారు.

# ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పర్యటన సందర్భంగా పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు: జిల్లా ఎస్పీ అశోక్ కుమార్





**కొండగట్టు జనవరి 2 (ప్రజా మంటలు) :** 1200 మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో భారీ బందోబస్తు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొండగట్టు పర్యటన సందర్భంగా శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా 1200 మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు.ఈ సందర్భంగా కొత్త సురేష్ గార్డెన్ లో ఏర్పాటు చేసిన బందోబస్తు బ్రీఫింగ్ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పాల్గొని, సంబంధిత అధికారులు, పోలీస్ సిబ్బందికి పూర్తి వివరాలతో బ్రీఫింగ్ నిర్వహించారు. పర్యటన సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బందోబస్తును సెక్టార్ల గా విభజించి అదనపు ఎస్పి స్థాయి అధికారులను బాధ్యులుగా నియమించడం జరిగింది అని అన్నారు. ప్రతి అధికారి, సిబ్బంది తమకు కేటాయించిన విధులను అత్యంత అప్రమత్తతతో నిర్వర్తించాలని సూచించారు.పర్యటనకు సంబంధించిన రూట్ మ్యాప్, వాహనాల రాకపోకలు, పార్కింగ్ ప్రదేశాలు, హెలిప్యాడ్ ప్రాంతాలు, కీలక కూడళ్ల వద్ద భద్రతా ఏర్పాట్ల గురించి జిల్లా ఎస్పీ సవివరంగా వివరించారు. ముఖ్యంగా ట్రాఫిక్ నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో పని చేయాలని ఆదేశించారు.వీఐపీ వెళ్ళే మార్గాల లో ప్రత్యేక భద్రత ఏర్పాటు చేయడంతో పాటు సీసీటీవీ కెమెరాల ద్వారా నిఘా కొనసాగించనున్నట్లు పేర్కొన్నారు.ప్రతి అధికారి బందోబస్తు కేటాయించిన ప్రాంతం పై పూర్తి అవగాహన మరియు చేయవలసినటువంటి డ్యూటీ గురించి పూర్తిగా తెలిసి ఉండాలని అన్నారు.ఏదైనా సందేహం ఉంటే సంబంధిత అధికారులను అడిగి తెలుసుకోవాలని సూచించారు. ప్రజలు, అభిమానులు పోలీసుల సూచనలు పాటిస్తూ సహకరించాలని, పర్యటనను సజావుగా నిర్వహించేందుకు అందరూ బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.ఈ యొక్క కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ లు భీమ్ రావు, శ్రీనివాస్ , డిఎస్పీ లు వెంకటరమణ,రఘు చందర్, రాములు, ఇతర జిల్లా నుంచి వచ్చిన డిఎస్పీలు సి.ఐలు, ఎస్సైలు పోలీస్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# హనీ ట్రాప్ లో శేఖర్ పై కుట్ర జరిగిందని పలు సంఘాల నేతలు



**ఇబ్రహీంపట్నం జనవరి 2(ప్రజ మంటలు దగ్గుల అశోక్) :** నియోజకవర్గంలో గత కొద్దిరోజులుగా హాట్ టాపిగ్గా మారిన హనీ ట్రాప్ లో బట్టు రాజశేఖర్ ట్రాప్ అయ్యాడ అని పలు సంఘాల నేతలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు, ఎప్పుడు సమాజ సేవలో ఉండే రాజశేఖర్ కు ఇలా జరగడం ఆశ్చర్యం, అనుమానం కలుగుతుందని అన్నారు.శేఖర్ గతంలో అంబేద్కర్ మండల అధ్యక్షుడుగా,యువజన సంఘాల అధ్యక్షుడిగా వ్యవహరించాడు మండలం మాల సంఘాల గౌరవ అధ్యక్షుడిగా, గ్రామ ఉపసర్పంచిగా ప్రజా సేవలో ముందు ఉండేవాడు,15 సంవత్సరాల రాజకీయ జీవితంలో ఎటువంటి మచ్చ లేకుండా ప్రజా సేవ చేశాడు,ఆపదలో ఉన్న వారికి అండగా ఉండి సహాయం అందించాడు, ప్రతి సేవా కార్యక్రమాల్లో చురుగ్గా ముందుండి అందరికీ సహాయం చేస్తూ ఉండేటటువంటి శేఖర్ ఎప్పుడూ ఎవరికీ హాని చేసే ఆలోచన కూడా ఉండేది కాదని అన్నారు, ఎప్పుడు ప్రజాసేవలో ఉండే వ్యక్తిపై కావాలని పాత రాజకీయాల కక్షల కారనాల వల్ల ఇందులో ఇరికించారని అనుమానాలున్నాయి, పదవులను పలుకుబడిని ఉపయోగించి వ్యక్తిగత జీవితాలతో రాజకీయం చేయడం సరైనది కాదని మేము భావిస్తున్నామని అన్నారు, పోలీసులపై చట్టంపై కోర్టులపై మాకు పూర్తి నమ్మకం ఉందనీ, ఏప్పటికైనా న్యాయం గెలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాజకీయంగా ఎదుగుతున్న క్రమంలో ఇలాంటి సంఘటన దురదృష్ట కరం,ఏది ఏమైనప్పటికీ సమగ్ర విచారణ జరపాలని కోరుతున్నాం అని ఇబ్రహీంపట్నం మండల యువజన సంఘం అధ్యక్షులు కారం ఇంద్రయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్, రాకేష్ ,గంగాధర్, విపుల్ ,శ్రీనివాస్,రాజు తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ మున్సిపల్ కౌన్సిల్ పై ఎంఐఎం జెండా ఎగురవేస్తాము

## నాంపల్లి ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్ పిలుపు





**జగిత్యాల, జనవరి 02(ప్రజా మంటలు) :** తెలంగాణ రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్న ఎంఐఎం పార్టీదే మాత్రమే సూపర్ పవర్ అని, ఎంఐఎం మద్దతు లేనిదే ఆకు కూడా కదలదని, రాష్ట్ర రాజకీయాల్లో ఎంఐఎం పార్టీ క్రియాశీలక పాత్ర పోషిస్తుందని, భవిష్యత్తులో ఎంఐఎం పార్టీని అధికారంలోకి తేవడమే లక్ష్యంగా శ్రమించాలని, హైదరాబాద్ నాంపల్లి ఎమ్మెల్యే, యూత్ ఐకాన్ మాజీద్ హుస్సేన్ అన్నారు. శుక్రవారం పట్టణంలో ని ఒక ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన సదస్సులో మాజీద్ హుస్సేన్ మాట్లాడారు. ఈ దేశం అందరిదని ఈ దేశంలో అందరికీ సర్వసమాన హక్కులు ఉన్నాయని, ఎంఐఎం పార్టీ అధినేత బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీ దేశవ్యాప్తంగా దళిత, ముస్లింల అభ్యున్నతి కోసం బడుగు బలహీన వర్గాల గొంతుకగా పార్లమెంట్ వేదికగా పోరాడుతున్న విషయాన్ని గుర్తు చేశారు. దేశంలో ఏమూలకు ఎలాంటి అన్యాయం జరిగిన పేదల పక్షాన పార్లమెంట్లో అధికార పక్షాన్ని నిలదీసిన దమ్మున్న నాయకుడు బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీ అని పేర్కొన్నారు. అందుకే ఎంఐఎం పార్టీని దేశవ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలు నమ్ముతూ పార్టీని ఆదరిస్తున్నారని చెప్పారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో జగిత్యాల నుంచి 10స్థానాల్లో ఎంఐఎం పార్టీ పోటీ చేయబోతుందని, కనీసం 8స్థానాల్లో విజయం సాధించి మున్సిపల్ కౌన్సిల్ పై ఎంఐఎం పార్టీ జెండా ఎగురవేస్తామన్నారు. పేదల అభ్యున్నతి కోసం, దళిత, ముస్లిం, బలహీన వర్గాల అభివృద్ధి లక్ష్యంగా సమాజ హితం కోసం ఎంఐఎం పార్టీ విశేషంగా కృషి చేస్తుందన్నారు. ఎంఐఎం పార్టీ కరీంనగర్ అధ్యక్షుడు గులాం అహ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ నగరంలో ఎంఐఎం పార్టీలో నిబద్ధత కలిగిన వ్యక్తులకు, పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమించే యువకులకు, ఎంఐఎం పార్టీలో ఎప్పుడు తలుపులు తెరిచి ఉంటాయని చెప్పారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో గెలుపు గుర్రాలను అన్వేషించి, పార్టీ ద్వారా ప్రత్యేక టీమ్ తో సర్వే నిర్వహించి, సర్వే ఆధారంగా, ప్రజా మద్దత్తు ఉన్న నేతకు, ప్రజలు కోరుకున్న వారికి టికెట్లు కేటాయిస్తామన్నారు. ఆయా డివిజన్లో మెజారిటీ ప్రజల అభీష్టం మేరకే కౌన్సిలర్ టికెట్ల కేటాయింపు ఉంటుందన్నారు. ఈకార్యక్రమంలో జగిత్యాల, కరీంనగర్ ఎంఐఎం పార్టీ నాయకులు, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

# కాలుష్యంతో దోమడుగు ఊరు విలవిల

## హెటెరో డ్రగ్స్ పై ఎన్హెచ్ఆర్సీ కి అడ్వకేట్ రామారావు ఫిర్యాదు

## పరిశ్రమ కాలుష్య కారకాలతో దీర్ఘకాలిక వ్యాధుల బారిన స్థానికులు



**సికింద్రాబాద్, జనవరి 02 ( ప్రజా మంటలు) :** సంగారెడ్డి జిల్లా దోమడుగు గ్రామం పరిశ్రమల కాలుష్యంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందని ఆరోపిస్తూ ప్రముఖ మానవ హక్కుల న్యాయవాది రామారావు ఇమ్మనేని జాతీయ మానవ హక్కుల కమిషన్ ( ఎన్హెచ్ఆర్సీ)ను ఆశ్రయించారు. దోమడుగు పరిసరాల్లో ఉన్న హెటెరో డ్రగ్స్ పరిశ్రమ కారణంగా గాలి, నీరు, భూమి తీవ్రమైన కాలుష్యానికి గురవుతున్నాయని, దీనివల్ల గ్రామ ప్రజల ఆరోగ్యం ప్రమాదంలో పడిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఏళ్ల తరబడి పరిశ్రమల వ్యర్థాల ప్రభావంతో దోమడుగు గ్రామంతో పాటు సమీప గ్రామాల ప్రజలు అనేక రకాల అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని ఆయన తెలిపారు. శ్వాసకోశ సంబంధిత వ్యాధులు, చర్మ రుగ్మతలు, కిడ్నీ సమస్యలు పెరుగుతున్నాయని, తాగునీరు కలుషితమై ప్రజలు దాన్ని వినియోగించలేని పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. వ్యవసాయ భూములు కూడా కాలుష్య ప్రభావంతో దిగుబడులు తగ్గి రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.కాలుష్య నియంత్రణ మండలి అధికారుల నిర్లక్ష్యమే ఈ పరిస్థితికి కారణమని రామారావు ఇమ్మనేని ఆరోపించారు. గ్రామస్తులు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా సరైన చర్యలు తీసుకోలేదని, తనిఖీలు కేవలం తూతూ మంత్రంగా సాగుతున్నాయని విమర్శించారు. నియంత్రణ సంస్థలు నిద్రలో ఉండటంతో ప్రజలు రోడ్లపైకి వచ్చి నిరసనలు చేపట్టాల్సి వచ్చిందని తెలిపారు. స్వచ్ఛమైన గాలి, శుద్ధమైన తాగునీరు, ఆరోగ్యకరమైన జీవితం ప్రతి పౌరుడి మౌలిక హక్కులని పేర్కొన్న ఆయన, పరిశ్రమల లాభాల కోసం ప్రజల హక్కులను హరించడం మానవ హక్కుల ఉల్లంఘనకు సమానమని అన్నారు. హెటెరో డ్రగ్స్ పరిశ్రమ వల్ల దోమడుగు గ్రామం బలవుతుండగా, ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఫిర్యాదులో వివరించినట్లు తెలిపారు.ఈ వ్యవహారంలో జాతీయ మానవ హక్కుల కమిషన్ తక్షణమే జోక్యం చేసుకుని సమగ్ర విచారణ చేపట్టాలని, కాలుష్యానికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధిత గ్రామస్తులకు నష్టపరిహారం చెల్లించాలని రామారావు ఇమ్మనేని కోరారు. దోమడుగు ప్రజలు తమకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేస్తూ, ప్రభుత్వాలు మరియు నియంత్రణ సంస్థలు వెంటనే స్పందించాలని డిమాండ్ చేస్తున్నారు.

# గాంధీనగర్‌లో మెగా క్రికెట్ టోర్నమెంట్

## కరపత్రాన్ని ఆవిష్కరించిన సర్పంచ్ కేతిరి లక్ష్మారెడ్డి

## యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపే లక్ష్యం



**భీమదేవరపల్లి, జనవరి 2 (ప్రజా మంటలు) :** గాంధీనగర్ గ్రామంలో జనవరి 4న (ఆదివారం) రోజున మెగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం గ్రామ సర్పంచ్ కేతిరి లక్ష్మారెడ్డి టోర్నమెంట్‌కు సంబంధించిన కరపత్రాన్ని అధికారికంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు మాట్లాడుతూ, నేటి యువతలో కొంతమంది మానసిక ఒత్తిడికి లోనై డ్రగ్స్, ఆన్‌లైన్ గేమింగ్, మద్యానికి బానిసలవుతూ ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు అతివేగంగా వాహనాలు నడిపి రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయి కుటుంబాలకు తీరని దుఃఖాన్ని మిగిల్చుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ పరిస్థితులకు ప్రత్యామ్నాయంగా యువతలో క్రీడల పట్ల ఆసక్తిని పెంచి, మనోధైర్యం, క్రమశిక్షణ, క్రీడా స్ఫూర్తిని నింపాలనే ఉద్దేశంతో ఈ క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువతలో సానుకూల మార్పు కోసం చేపడుతున్న ఈ ప్రయత్నంలో గ్రామ ప్రజలు, క్రీడాభిమానులు భాగస్వాములు కావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌తో పాటు నిర్వాహకులు, సీనియర్ క్రీడాకారులు, వార్డు సభ్యులు తాళ్లపల్లి కుమారస్వామి, మాజీ వార్డు సభ్యులు తాళ్లపల్లి రమేష్, తాళ్లపల్లి అశోక్, నిర్వహణ కమిటీ సభ్యులు తూముల అరవింద్, తాళ్లపల్లి ప్రసాద్, తాళ్లపల్లి అరవింద్, తాళ్లపల్లి విక్రమ్, తాళ్లపల్లి ఉదయ్ కిరణ్, తాళ్లపల్లి సంపత్, తాళ్లపల్లి బిన్ను తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల ఆరోగ్యమే లక్ష్యం

## ముల్కనూర్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారుల ఆకస్మిక తనిఖీలు

## హోటళ్లు, కిరాణా దుకాణాలపై ప్రత్యేక నిఘా



**భీమదేవరపల్లి, జనవరి 2 (ప్రజా మంటలు) :** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని ముల్క నూర్ గ్రామంలో జిల్లా ఫుడ్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్ అధికారులు శుక్రవారం విస్తృత స్థాయిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గ్రామంలోని హోటళ్లు, రెస్టారెంట్లు, కిరాణా దుకాణాలు, షాపింగ్ మాళ్లను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి బ్రహ్మజీ మాట్లాడుతూ, ఆహార పదార్థాల తయారీ నుంచి విక్రయం వరకు ప్రతి దశలో పరిశుభ్రత నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా బిర్యానీతో పాటు ఇతర మాంసాహార వంటకాల తయారీలో అనుమతించని రంగులు, రసాయనాలు ఉపయోగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కిరాణా దుకాణాల్లో గడువు ముగిసిన ఆహార పదార్థాలను విక్రయించినట్లు తేలితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. తనిఖీల్లో భాగంగా పలు హోటళ్ల నుంచి వివిధ రకాల ఆహార నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం ప్రయోగశాలలకు పంపినట్లు అధికారులు వెల్లడించారు. ప్రజల ఆరోగ్య భద్రతే ప్రధాన లక్ష్యమని, ఇలాంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని వారు స్పష్టం చేశారు.

# సీఎం రేవంత్‌ను కలిసిన యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు

## పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు

## తెలిపిన అడ్వకేట్ యేసుపాదం థామస్ - పార్టీ పటిష్టతపై చర్చ




**హైదరాబాద్/హుజురాబాద్, జనవరి 2 (ప్రజా మంటలు ప్రతినిధి కాశిరెడ్డి ఆదిరెడ్డి) :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని తెలంగాణ ప్రదేశ్ యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, హుజురాబాద్ నియోజకవర్గ యువ నాయకులు అడ్వకేట్ యేసుపాదం థామస్ మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన సంవత్సరం సందర్భంగా హైదరాబాద్‌లో సీఎంను కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి స్పందిస్తూ, యేసుపాదం థామస్‌కు, అలాగే హుజురాబాద్ నియోజకవర్గ ప్రజలందరికీ తిరిగి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. హుజురాబాద్ నియోజకవర్గంలో గత కొంతకాలంగా పార్టీ కార్యక్రమాల్లో యేసుపాదం థామస్ చురుగ్గా పాల్గొంటున్న విషయం తెలిసిందే. ఈ భేటీలో పార్టీ పటిష్టతకు యువత పోషించాల్సిన పాత్రపై క్లుప్తంగా చర్చించినట్లు సమాచారం. ఈ కార్యక్రమంలో యేసుపాదం థామస్‌తో పాటు యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివ చరణ్ రెడ్డి, ఇతర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# ముస్తాబవుతున్న ముల్కనూర్ సమ్మక్కసారమ్మ జాతర

## సర్పంచ్ జాలి ప్రమోద్ రెడ్డి పర్యవేక్షణలో ఘనంగా సమ్మక్క జాతర సన్నాహాలు





**భీమదేవరపల్లి, జనవరి 2 (ప్రజా మంటలు) :** మినీ మేడారం జాతరను తలపించే విధంగా ముల్కనూర్ గ్రామంలో నిర్వహించనున్న సమ్మక్కసారమ్మ జాతరకు విస్తృత ఏర్పాట్లు పూర్తవుతున్నాయి. గత రెండు రోజులుగా గ్రామపంచాయతీ సిబ్బంది ఆలయ పరిసరాలు, ప్రధాన రహదారులు, భక్తుల రాకపోక మార్గాలను శుభ్రపరచి జాతర వాతావరణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. గ్రామ సర్పంచ్ జాలి ప్రమోద్ రెడ్డి ప్రత్యక్ష పర్యవేక్షణలో పారిశుధ్య పనులు, తాగునీటి ఏర్పాట్లు, లైటింగ్, తాత్కాలిక మరుగుదొడ్లు, భద్రతా చర్యలు చేపట్టడం జరిగింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని విభాగాల సమన్వయంతో ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ తెలిపారు. జాతర సందర్భంగా గ్రామంతో పాటు పరిసర గ్రామాలు, పట్టణాల నుంచి లక్షలాదిమంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో ఏర్పాట్లు చేస్తున్నారు.


# ఘనంగా ఉప్పల పాండు ముదిరాజ్ జయంతి

## న్యూ ఇయర్ క్యాలెండర్ ఆవిష్కరణ



**సికింద్రాబాద్, జనవరి 02 (ప్రజా మంటలు) :** తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ప్రముఖ ఉద్యమకారుడు ఉప్పల పాండు ముదిరాజ్ జయంతి సందర్భంగా తెలంగాణ ప్రగతి సేవ సమస్త చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నూతన క్యాలెండర్‌ను ఘనంగా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఉప్పల పాండు ముదిరాజ్ తెలంగాణ కోసం చేసిన ఉద్యమాలు, ఆయన సేవలను వక్తలు కొనియాడారు. సమాజ సేవే లక్ష్యంగా తాను స్థాపించిన తెలంగాణ ప్రగతి సేవ సమస్త చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పేద విద్యార్థులకు ప్రతి సంవత్సరం ప్రభుత్వ పాఠశాలలకు వేలాది పుస్తకాలను పంపిణీ చేస్తూ విద్యాభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు.చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శకుంతల ముదిరాజు గారు, వీ. నర్సింగరావు ముదిరాజు గారిని ఈ సందర్భంగా పలువురు అభినందించారు.ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు రామచంద్రయ్య, వెంకట దాస్ ముదిరాజ్, ట్రస్ట్ కోశాధికారి పొట్లకాయల వెంకటేశ్వర్లు ముదిరాజ్, విజయకుమార్, కుమారస్వామి, నాగేష్, బిక్షపతి, రామోజీ, నర్సింగరావు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# తినే టిఫిన్‌లో బల్లి ప్రత్యక్షం




దోస తినే సమయంలో చట్నీలో బల్లి ప్రత్యక్షం.జగిత్యాలలోని శివసాయి టిఫిన్ సెంటర్‌లో ఘటన.టిఫిన్‌లో బల్లి బయటపడటంతో భయాందోళనకు గురై ఆసుపత్రికి పరిగెత్తిన కస్టమర్స్.బుగ్గారం గ్రామానికి చెందిన ఓ మహిళ టిఫిన్ చేస్తున్నప్పుడు బయటపడ్డ బల్లి.ఒక్కసారిగా వాంతులు, అస్వస్థతకు గురైన మహిళ.. హోటల్ యాజమాన్యంతో తీవ్ర వాగ్వాదం.చికిత్స కోసం మహిళను ఆసుపత్రికి తరలింపు. గతంలోనూ శివసాయి హోటల్ లో టిఫిన్‌లో బొద్దింకలు బయటపడిన ఘటనలు.తాజాగా టిఫిన్‌లో బల్లి ఘటనతో పట్టణంలో మరోసారి కలకలం.

# ఎస్ఐ ని మర్యాద పూర్వకంగా కలిసిన నాయకులు




**చిగురుమామిడి, జనవరి 2 (ప్రజా మంటలు) :** చిగురుమామిడి మండల నూతన ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన దూలం పృధ్వీదర్ గౌడ్ ను కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు బోయిని వంశీకృష్ణ, ౦=మీా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లి తిరుపతి , ఎడెల్లి బాబ, మేకల సురేష్ బోయిని చేతన్,బండారి రాహుల్ ,బోయిని భానులు శుక్రవారం రోజున మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు మండలంలో శాంతి భద్రతలు పరిరక్షించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.రోడ్డు ప్రమాదలపై, మత్తు పదార్థాల వల్లే వచ్చే నష్టాలపై మండల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

# రాష్ట్రవ్యాప్తంగా దట్టమైన పొగ మంచు

**వాహనదారులు తీవ్ర ఇబ్బందులు**

**పొగమంచు కారణంగా రహదారులపై నిలిచిన వాహనాలు**

**రాకపోకలకు తీవ్ర అంతరాయం**

**నిలిచి ఉన్న వాహనాల వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం**



రాష్ట్రవ్యాప్తంగా చలి తీవ్రత పెరుగుతోంది. ప్రజలు ఇళ్ల నుంచి బయటికి రావాలంటే వణికిపోతున్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలనే వ్యత్యాసం లేకుండా కనిష్ఠ ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గిపోతున్నాయి. ఇక ఏజెన్సీ ప్రాంతాల్లోనైతే ఉష్ణోగ్రతలు మరీ దారుణంగా పడిపోతున్నాయి. రాష్ట్ర ప్రజలను చలి గజగజలా డిస్తోంది.పొగ మంచు కమ్మేసి వాతావరణమంతా శ్వేతమయంగా మారింది. మంచు ఎక్కువగా కురుస్తుండడంతో వాహనదారుల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రహదారులను మంచు దుప్పటి కప్పేసింది. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. చలి తీవ్రత అధికంగా ఉండడం వల్ల వృద్ధులు, చిన్నారులు, దీర్ఘకాల వ్యాధిగ్రస్థులు ఇబ్బందులు పడుతున్నారు. కొందరూ చలి మంటలు వేసుకుని ఉపశమనం పొందుతున్నారు.బాపట్లజిల్లా చీరాల, పర్చూరు నియోజకవర్గాలను మంచు దుప్పటి కప్పేసింది. దీంతో వాహనాలదారులు లైట్లు వేసుకుని ప్రయాణాలు సాగిస్తున్నారు. చీరాల, వేటపాలెం, చినగంజాం, పర్చూరు, మార్టూరు ప్రాంతాల్లో పొగమంచు దట్టంగా అలుముకుంది. దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారు, చిన్నారులు బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. ప్రయాణం సాగాలంటే వాహనాల హెడ్ లైట్లు వెల్లాల్సిందే, లేదంటే ప్రమాదమే. ఒంగోలు-కత్తిపూడి జాతీయ రహదారిపై మంచు ఆవహించటంతో వాహనాలు నెమ్మదిగా వెళుతున్నాయి. రైళ్లు కూడా నిదానంగా వెళుతున్నాయి.ప్రకాశం జిల్లా అద్దంకి పట్టణంలో ఉదయం 7 గంటల సమయంలోనూ మంచుపొరలు తొలగలేదు. అద్దంకి పట్టణం, గుండా నామ్ రహదారిపై విపరీతమైన పొగ మంచు ఉండటంతో వాహనదారుల అవస్థలు అన్నీ ఇన్నీ కాదు. ఈ రహదారిపై నిత్యం భారీ వాహనాల రాకపోకలు సాగిస్తుంటాయి. పొగ మంచు దట్టంగా ఆవరించటంతో ఎదురుగా వచ్చే వాహనానికి హెడ్‌లైట్లు ఏమాత్రం కనిపించడం లేదు. దగ్గరగా వచ్చే వరకు ద్విచక్ర వాహనాలు కనపడకపోవటంతో భారీ వాహన చోదకులు ఇబ్బందులకు గురవుతున్నారు.శ్రీకాకుళం జిల్లా వ్యాప్తంగా దట్టమైన పొగ మంచు కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పొగ మంచు ప్రభావంతో వాహనాలు రహదారులపై నిలిచిపోతున్నాయి. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. ఉదయం 9 గంటల వరకు మంచు తీవ్రత తగ్గకపోవడంతో జనజీవనం స్తంభించింది.శీతల పదార్థాలకు దూరంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. వేడిగా ఉండే ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలి. గోరు వెచ్చటి నీరు తాగితే మంచిది. మంచులో ఉదయం, రాత్రులు తిరగటం తగ్గించాలి. అవసరమైనపుడు ఉన్ని దుస్తులు, స్వెట్టర్లు, మాస్కులు ధరించాలి. చలికాలంలో తక్కువ మోతాదులో నీరు తీసుకోవడం మంచిది కాదు. దీని వల్ల పలు అనార్యోగ సమస్యలు వస్తాయి. ఎక్కువ నీరు తీసుకోవడం వల్ల లోపల పేరుకుపోయిన కఫం బయటకు వస్తుంది. న్యూమోనియా రాకుండా ఉండేందుకు చిన్నారులు, పెద్దలు టీకాలు వేయించుకోవాలి. శ్వాస సమస్యలు ఉన్నవారు ఉదయం సమ యంలో చల్లటి గాలికి వాకింగ్ చేయడం కొద్ది రోజులు తగ్గించాలి అని వైద్యులు చెబుతున్నారు. రాష్ట్రంలో చలి బాగా పెరిగింది. ఈ పరిస్థితుల్లో చిన్నారులు, వృద్ధులు మరింత అప్రమత్తంగా ఉండాలి. న్యూమోనియా వచ్చే ప్రమాదం ఉంది. దీనివల్ల జలుబు, దగ్గు, జ్వరం, శ్వాస తీసుకోవటంలో ఇబ్బందులు ఎదురవుతాయి. శీతాకాలంలో జాగ్రత్తలు పాటించకుంటే రక్తనాళాలు గడ్డ కట్టే ప్రమాదం పొంచి ఉంది. తద్వారా గుండె, బ్రెయిన్ స్ట్రోక్‌లు వంటివి వచ్చే అవకాశం ఉంది. అనారోగ్యానికి గురైతే వెంటనే ఆసుపత్రిలో వెళ్లాలి. సరైన చికిత్స చేయించుకోవాలి. ఎల్లప్పుడూ పోషకాహారాన్నే తీసుకోవాలని, ఈ సీజన్లో లభించే పండ్లు తినాలని వైద్యులు సూచిస్తున్నారు.

# కృష్ణపట్నం థర్మల్ విద్యుత్ కేంద్రానికి విదేశీ బొగ్గు

**సంక్రాంతి నాటికి మొదటి నౌక!**

**5 లక్షల టన్నుల సరఫరాకు ఎల్‌వోఏ ఇచ్చిన జెన్‌కో**

**ప్లాంటు సామర్థ్యం మేరకు రికార్డుస్థాయి విద్యుదుత్పత్తి**



కృష్ణపట్నం థర్మల్ విద్యుత్ కేంద్రానికి విదేశీ బొగ్గు రానుంది. ఇండోనేషియా నుంచి 5 లక్షల టన్నుల సరఫరా చేసేందుకు అదానీ సంస్థకు జెన్‌కో లెటర్ ఆఫ్ ఎగ్రిమెంట్ (ఎల్‌ఓఏ) జారీ చేసింది. దీని ప్రకారం జనవరి నుంచి సరఫరా ప్రారంభించి, 3 నెలల్లో పూర్తి చేయాలి. వేసవిలో విద్యుత్ కొరతను అధిగమించే చర్యల్లో భాగంగా థర్మల్ విద్యుత్ కేంద్రాలకు అవసరమైన బొగ్గు నిల్వలు ఉండేలా చూడటంపై జెన్‌కో దృష్టి సారిస్తోంది. అన్ని థర్మల్ ప్లాంట్ల స్థాపిత సామర్థ్యంలో కనీసం 85 శాతం మేర విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. అందుకు అనుగుణంగా కృష్ణపట్నం థర్మల్ కేంద్రాల్లో మొదటి 2 యూనిట్ల డిజైన్ మేరకు 70 శాతం విదేశీ బొగ్గు వినియోగించాలి. దీని కోసం జెన్‌కో టెండర్లు సైతం పిలిచింది. సంక్రాంతి నాటికి కృష్ణపట్నం నౌక: ఒప్పందం ప్రకారం అదానీ సంస్థ ఇండోనేసియా నుంచి కనీసం 6,000 పైగా గ్రాస్ కెలోరిఫిక్ వాల్యూ (బొగ్గును దహనం చేసేటప్పుడు విడుదల అయ్యే ఉష్ణశక్తి) ఉన్న బొగ్గును సరఫరా చేయాల్సి ఉంటుంది. 75,000 టన్నులతో మొదటి రవాణా నౌక అక్కడి నుంచి బయలుదేరింది. ఆ నౌక సంక్రాంతి నాటికి కృష్ణపట్నం చేరుకునే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.కృష్ణపట్నం పోర్టు నుంచి కన్వేయర్ బెల్టు ద్వారా థర్మల్ యూనిట్‌కు బొగ్గు తరలిస్తారు. ఈ సౌలభ్యం దృష్ట్యా తక్కువ పరిమాణంలో బొగ్గు నిల్వలను తెప్పిస్తున్నారు. దీని ద్వారా పోర్టు హ్యాండ్లింగ్ ఛార్జీల భారాన్ని తగ్గించాలని అధికారులు ఆలోచన చేస్తున్నారు. ఒకేసారి 1.10 లక్షల టన్నులు తెచ్చుకునే అవకాశం ఉన్నా, 75,000 టన్నులకే పరిమితం అవుతున్నారు.కృష్ణపట్నం థర్మల్ విద్యుత్ కేంద్రం ఏర్పాటు తర్వాత మొదటిసారిగా వారం రోజులుగా రికార్డు స్థాయిలో 2,035 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి స్థిరంగా గ్రిడ్‌కు అందుతోంది. గతంలో ఇది 1,200 నుంచి 1,400 మెగావాట్ల మధ్య ఉండేది. కృష్ణపట్నంలో ఒక్కొక్కటి 800 మెగావాట్ల సామర్థ్యం ఉన్న 3 యూనిట్లు ఉన్నాయి. అవి పూర్తి సామర్థ్యంతో పని చేస్తే 2,400 మెగావాట్లు ఉత్పత్తి అవుతుంది.ప్లాంటు ఏర్పాటు చేసినప్పటి నుంచి 60 నుంచి 65 శాతం సామర్థ్యంలోనే పని చేస్తున్నాయి. మొదటి రెండు యూనిట్లను 70 శాతం విదేశీ బొగ్గు అంటే 6 వేల జీసీవీ కంటే ఎక్కువ, మిగిలిన 30 శాతం స్థానిక బొగ్గు వినియోగించేలా రూపొందించారు. అందుకు విరుద్ధంగా ప్లాంట్ కేవలం స్థానిక బొగ్గును మాత్రమే వినియోగిస్తోంది. ఈ కారణంగానే పూర్తి సామర్థ్యం మేరకు ఉత్పత్తి రావడం లేదు.ఉత్పత్తి పెంచుకోవడానికి జెన్‌కో ప్రత్యామ్నాయ ఆలోచనలు చేసింది. ఒడిశాలోని మహానది కోల్ ఫీల్డ్స్ (వీజూ) నుంచి తీసుకునే బొగ్గు కోటాలో సుమారు లక్ష టన్నులను కోల్‌కతాలోని ఈస్ట్రన్ కోల్ ఫీల్డ్స్ నుంచి తీసుకునేలా మార్పు చేసింది. అక్కడ నాణ్యమైన బొగ్గు కనీసం 5,800 జీసీవీ వస్తోంది.దీంతో పాటు ఎంసీఎల్ నుంచి తీసుకున్న వాష్డ్ కోల్‌ను కలిపి ప్రస్తుతం వినియోగిస్తున్నారు. దీంతో ప్లాంటు ఉత్పత్తి సామర్థ్యం గణనీయంగా పెరిగింది. దీని వల్ల రోజుకు సుమారు 600 మెగా వాట్లు అదనంగా ఉత్పత్తి అవుతోంది. దీంతో డిస్కంలకు సుమారు 14 మిలియన్ యూనిట్ల (వీఖ) విద్యుత్ అందుతోంది. ఆ మేరకు పీక్ డిమాండ్ సమయంలో బహిరంగ మార్కెట్‌లో అధిక ధరకు కొనుగోలు చేసే విద్యుత్‌ను తగ్గించుకునే వెసులుబాటు డిస్కంలకు లభించింది. ఈ ప్లాంటు నుంచి యూనిట్ రూ.4.20కే అందుతోంది. దీని వల్ల విద్యుత్ కొనుగోలు ఖర్చు భారీగా అదా అవుతోందని అధికారులు పేర్కొంటున్నారు.

# విజయవాడ బుక్ ఫెస్టివల్

**పుస్తక మహోత్సవానికి వేదిక సిద్ధం!**

**ఇందిరాగాంధీ స్టేడియంలో 36వ ప్రదర్శన**

**309 స్టాళ్లు జనవరి 12 వరకు నిర్వహణ**

**ఈ నెల 12 వరకు కొనసాగనున్న ప్రదర్శన**

విజయవాడ పుస్తక మహోత్సవానికి వేదిక సిద్ధమైంది. 36వ పుస్తక పండగ విజయవాడలో సందడి చేయనుంది. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జనవరి 02 నుంచి 12 వరకు ఈ వేడుక జరగబోతోంది. గతేడాదితో పోలిస్తే ఈసారి స్టాళ్ల సంఖ్య బాగా పెరిగింది. దేశంలో ప్రముఖ ప్రచురణ సంస్థలు అన్నీ తరలి వచ్చాయి. ఈసారి తెలుగుతో పాటు ఆంగ్ల పుస్తకాల ప్రచురణ సంస్థలు భారీగా వచ్చాయని విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ (ఎదీఖీూ) అధ్యక్షుడు టి.మనోహర్‌నాయుడు తెలిపారు. ప్రతిరోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 9 వరకు కూడా ప్రదర్శన కొనసాగుతుంది.భారీ స్థాయిలో ఏర్పాట్లు: హైదరాబాద్‌లో పుస్తక మహోత్సవానికి ఈసారి విపరీత రద్దీ నెలకొంది. కొనుగోళ్లు కూడా భారీగా పెరిగాయి. అందుకే విజయవాడ పుస్తక మహోత్సవానికి సైతం స్పందన భారీగా ఉండబోతుందని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధానంగా పిల్లలు, యువత ఎక్కువగా రానున్నారు. పాఠశాలల్లో పుస్తక పఠనం పెంచేందుకు చేస్తున్న ప్రయత్నాలే దీనికి కారణమనే చెప్పవచ్చు.దేశంలోని ప్రముఖ ప్రచురణ సంస్థలవి 262 స్టాళ్లు కాగా, 47 స్టాళ్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలవి. గత ఏడాది 240 స్టాళ్లే ఏర్పాటు అయ్యాయి. గతసారి పుస్తక మైదానానికి వేదిక వెతుకులాటతోనే ఆఖరు నిమిషం వరకూ ఉత్కంఠ నెలకొంది. చివరిలో ఇందిరాగాంధీ మైదానం కుదిరింది. ఈసారి ముందే వేదికపై స్పష్టత వచ్చింది. దీంతో స్టాళ్ల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది.

**స్టాల్స్‌లో పుస్తకాలు సర్దుకుంటూ**



పుస్తక మహోత్సవం విశేషాలు: కృష్ణా, గుంటూరుల్లోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు తరలి వచ్చేలా సహకరించాలని విద్యాశాఖ ఉన్నతాధికారులను వీబీఎఫ్ఎస్ తరఫున విజ్ఞప్తి చేశారు. దీంతో ఈసారి విద్యార్థుల రద్దీ విపరీతంగా ఉండనుంది.కోల్‌కతా పుస్తక ప్రదర్శన స్ఫూర్తితో ఏటా 'పుస్తక ప్రియుల పాదయాత్ర' బెజవాడలోను కూడా నిర్వహిస్తున్నారు. జనవరి 6న సాయంత్రం 4 గంటలకు మొగల్రాజపురం సిద్ధార్థ కళాశాల నుంచి పుస్తక మహోత్సవ ప్రాంగణం వరకు కూడా ఈ పాదయాత్రను నిర్వహించనున్నారు. ఈసారి సీఎం చంద్రబాబు రానున్నారు.1989 అక్టోబరులో నేషనల్ బుక్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మొట్టమొదటి పుస్తక మహోత్సవం విజయవాడలో నిర్వహించారు. తర్వాత ప్రతి సంవత్సరం పుస్తక మహోత్సవం నిర్వహించాలని ప్రచురణకర్తలు నిర్ణయించారు. విజయవాడలో ప్రచురణకర్తలు, సాహితీవేత్తలు, కవులు, రచయితలు అంతా కలిసి విజయవాడ పుస్తక మహోత్సవ సంఘం (ఎదీఖీూ)గా ఏర్పడ్డారు. తొలి ఏడాది 1989లో 84 స్టాళ్లతో నిర్వహించారు. 1991లో ఈ సంఖ్యం 90కు పెరిగింది. 2015లో అత్యధికంగా 389 స్టాళ్లు ఏర్పాటుతో రికార్డు సృష్టించారు. క్రమంగా స్టాళ్లు తగ్గుతూ వస్తున్నాయి. ఈసారి స్టాళ్లు 309కి పెరిగాయి.విజయవాడలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వీబీఎఫ్ఎస్ సమన్వయకర్త ఎమెస్కో విజయకుమార్, అధ్యక్షుడు టి.మనోహర్‌నాయుడు మాట్లాడుతూ పుస్తక మహోత్సవాన్ని నేడు సాయంత్రం 5.30 గంటలకు సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పమిడిఘంటం శ్రీనరసింహ ముఖ్యఅతిథిగా హాజరవుతారు. ఈ పుస్తక మహోత్సవాన్ని ప్రారంభిస్తారు. గౌరవ అతిథులుగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, డిప్యూటీ స్పీకర్ రఘురా మకృష్ణరాజు తదితరులు హాజరవుతారని వెల్లడించారు. ఈ ఏడాది పెద్ద ఎత్తున ప్రచురణ సంస్థలు తరలి వస్తున్నాయన్నారు. మొత్తం 309 స్టాళ్లు ఏర్పాటు అవుతున్నాయని వివరించారు. కార్యక్రమంలో వీబీఎఫ్ఎస్ కార్యదర్శి కె.లక్ష్మయ్య, ఉపాధ్యక్షుడు జె.ప్రసాద్, సంయుక్త కార్యదర్శి సాయిరామ్, కోశాధికారి కె.రవి పాల్గొన్నారు. పుస్తక ప్రదర్శన బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న కె.లక్ష్మయ్య, ఎమెస్కో విజయకుమార్, కె.మనోహర్‌నాయుడు, కె.రవి ప్రముఖుల రాక: ఈనెల 3వ తేదీన ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు, 4న మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు రానున్నారు. మహోత్సవంలో భాగంగా ఏటా నిర్వహించే పుస్తక ప్రియుల పాదయాత్రకు 6న సీఎం చంద్రబాబు హాజరవుతారు. 9వ తేదీన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పాల్గొంటారు.ప్రతి స్టాల్‌లోనూ ఏ పుస్తకం కొనుగోలు చేసినా దానిపై 10 శాతం రాయితీ ఇస్తారు. పుస్తక మహోత్సవ ప్రాంగణానికి వడ్లమూడి విమలాదేవి, ప్రధాన సాహిత్య వేదికకు ప్రముఖ రచయిత డాక్టర్ బి.వి.పట్టాభిరామ్, ప్రతిభా వేదికకు ప్రముఖ ఖగోళ భౌతిక శాస్త్రవేత్త జయంత్ నార్లీకర్ పేర్లను ఈ సంవత్సరం పెట్టారు.

# ముంబైలో దారుణం.. న్యూ ఇయర్ స్వీట్స్ ఇస్తానంటూ పిలిచి.. ప్రియుడిపై వివాహిత ఘాతుకం

**పెళ్లికి నిరాకరించిన ప్రియుడిపై మహిళ దాడి**

**న్యూ ఇయర్ స్వీట్స్ పేరుతో ఇంటికి పిలిచి ఘాతుకం**

**కత్తితో మర్మాంగంపై దాడి చేయడంతో తీవ్ర గాయాలు**

**నిందితురాలి పరారీ.. కేసు నమోదు**




ముంబైలో అత్యంత దారుణమైన ఘటన వెలుగుచూసింది. తనను పెళ్లి చేసుకోవడానికి నిరాకరించాడన్న కోపంతో ఓ వివాహిత తన ప్రియుడి మర్మాంగంపై కత్తితో దాడి చేసింది. న్యూ ఇయర్ స్వీట్స్ ఇస్తానని నమ్మించి ఇంటికి పిలిచి ఈ ఘాతుకానికి పాల్పడింది. బాధితుడు ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, నిందితురాలు పరారీలో ఉంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం 25 ఏళ్ల మహిళకు, 44 ఏళ్ల వ్యక్తికి గత ఆరేడు సంవత్సరాలుగా వివాహేతర సంబంధం ఉంది. వీరిద్దరూ బంధువులు కూడా. అయితే, భార్యను వదిలేసి తనను పెళ్లి చేసుకోవాలని నిందితురాలు కొన్నాళ్లుగా ప్రియుడిపై తీవ్ర ఒత్తిడి తెస్తోంది. ఈ విషయమై వారి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఆమె ఒత్తిడి భరించలేక బాధితుడు 2025 నవంబర్ లో బిహార్‌లోని తన స్వగ్రామానికి వెళ్లాడు. అక్కడికి కూడా ఆమె ఫోన్లు చేసి బెదిరింపులకు పాల్పడింది.డిసెంబర్ 19న ముంబైకి తిరిగి వచ్చిన బాధితుడు, ఆమెతో సంబంధాలు తెంచుకుని దూరంగా ఉంటున్నాడు. ఈ క్రమంలో డిసెంబర్ 31 అర్ధరాత్రి 1:30 గంటల సమయంలో న్యూ ఇయర్ స్వీట్స్ తీసుకోవడానికి ఇంటికి రావాలని ఆమె అతడిని ఆహ్వానించింది. ఇంట్లోకి వెళ్లాక, అతడిని ప్యాంటు విప్పమని చెప్పి, వంటగది నుంచి కూరగాయలు కోసే కత్తితో వచ్చి మర్మాంగంపై దాడి చేసింది.తీవ్ర రక్తస్రావంతో గాయపడిన బాధితుడు, అక్కడి నుంచి తప్పించుకుని తన ఇంటికి చేరుకున్నాడు. కుటుంబ సభ్యులు అతడిని మొదట వీఎన్ దేశాయ్ ఆసుపత్రికి, ఆ తర్వాత సియోన్ ఆసుపత్రికి తరలించారు. గాయం చాలా లోతుగా ఉందని, శస్త్రచికిత్స అవసరం కావచ్చని వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు, పరారీలో ఉన్న నిందితురాలి కోసం గాలిస్తున్నారు.

# విదేశీ చదువులకు ఆర్థిక అండ కావాలా?

**ఈ నెల 20లోపు అప్లై చేసుకోండి**

**వెనుకబడిన తరగతుల విద్యార్థుల విదేశీ చదువుల కోసం ప్రవేశ పెట్టిన పథకం**

**డిగ్రీ, ఇంజినీరింగ్‌లో మెరుగైన మార్కులు అవసరం**

**తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.5 లక్షల్లోపు ఉంటే దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు**



ఆర్థికంగా వెనుకబడిన తరగతుల విద్యార్థులు విదేశాల్లో ఉన్నత చదువులు చదువుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేక పథకం అమలు చేస్తోంది. అల్ప సంఖ్యాకులు, షెడ్యూల్డు కులాలు, గిరిజనులు, వెనుకబడిన తరగతులకు చెందిన వారు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ప్రతిభ ఉన్న వారికి పేదరికం అడ్డు కారాదన్న ఉద్దేశంతో వివిధ వర్గాలకు చెందిన విద్యార్థులను ప్రోత్సహిస్తోంది. అర్హత, ఆసక్తి ఉన్నవారి నుంచి దరఖాస్తులు స్వీకరించడం ప్రారంభించింది.షెడ్యూల్డు కులాలు, మైనార్టీల్లో ముస్లింలు, క్రైస్తవులు, సిక్కు, జైన, భౌద్ధ, పార్శీలు, గిరిజనులు, వెనుకబడిన తరగతుల విద్యార్థులు అర్హులు. వయసు 35 ఏళ్లకు మించరాదు. తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.5 లక్షల్లోపు మాత్రమే ఉండాలి. డిగ్రీ, ఇంజినీరింగ్‌లో మెరుగైన మార్కులు సాధించాలి. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.తెలంగాణ.ఈపాస్.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలి. అయితే దరఖాస్తు స్వీకరణ గడువు జనవరి 20తో ముగియనుంది. అమెరికా, ఆస్ట్రేలియా, యూకే, కెనడా, సింగపూర్, జర్మనీ, దక్షిణ కొరియా, జపాన్, ఫ్రాన్స్, న్యూజిలాండ్‌లోని గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయాల్లో 1 జులై 2025 నుంచి 31 డిసెంబర్ 2025 వరకు పోస్టు గ్రాడ్యుయేట్ లేదంటే పీహెచ్‌డీ అధ్యయనంలో ప్రవేశం పొంది ఉండాలి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అన్ని అర్హతలుండాలి. దరఖాస్తు చేసిన హార్డ్ ప్రతిని ఆయా సంక్షేమ శాఖల అధికారులకు అందించాలి.

**జత చేయాల్సినవి :**

పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, బీటెక్ ధ్రువపత్రాలు.ఆదాయ, నివాస, కుల ధ్రువీకరణ పత్రాలు.పాస్‌పోర్టు, వీసా, విశ్వవిద్యాలయం అనుమతి పొందిన ప్రతి జీఆర్ఈ, జీమాట్, టోఫెల్, ఈఎస్ఎల్‌టీసీ అర్హత ప్రతి, బ్యాంక్ ఖాతా వివరాలు సద్వినియోగం చేసుకోవాలి."విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులకు ఇది చక్కటి అవకాశం. ఆసక్తి ఉన్న వారు విదేశీ విద్యానిధి పథకానికి గడువులోగా దరఖాస్తు చేసుకోవాలి. ఉపకార వేతనాలతో ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలి." - ఎస్.రాజేశ్వరి, జిల్లా మైనార్టీ సంక్షేమాధికారిణి.2016 నుంచి పథకం సద్వినియోగం చేసుకున్న అభ్యర్థులు 24 మంది మైనార్టీలు, 14 మంది ఎస్సీలు, 8 మంది ఎస్టీలు ఉన్నారు. విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించాలనే కోరిక ఉన్న వారికి ఇది ఒక మంచి అవకాశం. చదవాలని ఉండి, అందుకు కావాల్సిన ఆర్థిక స్తోమత లేక చాలా మంది తమ కలలను వదులుకుంటారు. ఈ విషయాన్ని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ప్రతిభ కలిగిన పేద విద్యార్థులను ప్రోత్సహించి విదేశాలలో విద్యనభ్యసించడం కోసం పంపేందుకు ఈ నిర్ణయం తీసుకుంది. మీరు అర్హత కలిగి ఉండి, ఈ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకుంటే విదేశాల్లో చదవాలి అనుకునే వారి కల నెరవేరుతుంది. అసక్తి ఉన్న వారు ఈ నెల 20లోపు అప్లై చేసుకోవాలి.తెలంగాణ ఎలక్ట్రానిక్ పేమెంట్ అండ్ అప్లికేషన్ సిస్టమ్ ఆఫ్ స్కాలర్‌షిప్స్ (తెలంగాణ ఈ-పాస్) అనేది రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో ఉండే అధికారిక పోర్టల్. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ, దివ్యాంగ విద్యార్థులకు స్కాలర్‌షిప్ సదుపాయం కల్పించేందుకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. ఈ పోర్టల్ ద్వారా విద్యార్థులు ఆఫీసులకు వెళ్లకుండానే ఎక్కడి నుంచి అయినా ఆన్‌లైన్‌లో అప్లికేషన్‌లను సమర్పించవచ్చు. వివిధ రకాల ఫీజులతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న రిజర్వ్‌డ్ కోటాకు చెందిన విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించడం ఈ కార్యక్రమం ప్రాథమిక ఉద్దేశం.

# చైనా మాంజాతో ముంచుకొస్తున్న ప్రమాదం

**అప్రమత్తంగా లేకుంటే గాల్లోకి ప్రాణం!**

**నిషేధం ఉన్నప్పటికీ యథేచ్ఛగా విక్రయాలు**

**ద్విచక్ర వాహనదారుల మెడకు చుట్టుకుని ప్రమాదం**

**పక్షులకు కూడా తప్పని ముప్పు**

**ఈ సమయం కొన్ని జాగ్రత్తలు తప్పనిసరి**

**ప్రమాదకరమైన వాటితో తయారైన మాంజా**



జనవరి నెల వచ్చేసింది. ఇక అందరూ రానున్న సంక్రాంతి పండగ గురించి ఏర్పాట్లు చేయడం మొదలుపెట్టారు. ముఖ్యంగా సంక్రాంతి అనగానే పిల్లలకు ముందుగా గుర్తుకు వచ్చేది వాళ్లు ఎంతో సరదాగా ఎగురవేసే గాలిపటాలు. అందుకే జనవరి నెల మొదలవగానే గాలిపటాలతో పిల్లలు సిద్ధంగా ఉంటారు. అంతే కాకుండా గాలి పటాలను ఎగురవేసేందుకు ఎన్నో ప్రయత్నాలు చేస్తుంటారు. అయితే ఎంతో సరదాగా ఆడుకునే ఈ ఆటలో ఇంకా ఎన్నో ప్రమాదాలు కూడా దాగి ఉన్నాయి. పండగ వేళల్లో సందడిగా ఉండాల్సిన కొందరి ఇళ్లు విషాదంగా మారుతున్నాయి. దానికి కారణం గాలిపటాలు ఎగురవేసేందుకు ఉపయోగించే చైనా మాంజా దారం.చైనా మాంజా పంజా విసురుతోంది. నిషేధం ఉన్నప్పటికీ యథేచ్ఛగా విక్రయాలు సాగుతున్నాయి. చాలామంది వాటి బారిన పడుతున్నారు. మేడలు, అపార్ట్‌మెంట్లపైకి వెళ్లి పతంగులను ఎగురవేస్తుండగా కొన్నిసార్లు అవి చెట్లకు చిక్కుకొని తెగిపోతున్నాయి. ఆ మాంజా అలాగే వేలాడుతుంటుంది. ఆ మార్గంలో వెళ్లే ద్విచక్ర వాహనదారుల మెడకు అది చుట్టుకొని గాయపడుతున్నారు. బైక్ వేగాన్ని బట్టి ప్రమాద తీవ్రత పెరిగి కొన్నిసార్లు ప్రాణాలు కోల్పోతున్నారు. పక్షులు కూడా వాటికి చిక్కుకొని చనిపోయిన ఘటనలున్నాయి.ఇటీవల షంషీర్‌గంజ్‌లో యువకుడు బైక్‌పై వెళ్తుండగా చైనా మాంజా గొంతుకు చుట్టుకొని తీవ్రంగా గాయపడ్డాడు. మల్లికార్జున్‌నగర్‌లో మరో యువకుడి మెడకు చుట్టుకోవడంతో గాయపడి ఆసుపత్రిలో చేరాడు. మెడ కింది వరకు 19 కుట్లు వేశారు. ఏటా ఈ తరహా ప్రమాదాలు జరుగుతున్నా, అధికార యంత్రాంగం ఉదాసీనంగా వ్యవహరిస్తోంది. ఎక్కడపడితే అక్కడ వాటి అమ్మకాలు జరుగుతున్నప్పటికీ మొక్కుబడి చర్యలతో సరిపెడుతున్నారు.

**తీసుకోవల్సిన జాగ్రత్తలు :**

బైక్‌పై వీధులు, సందుల్లో వెళ్లేటప్పుడు పరిసరాలను గమనిస్తూ తక్కువ వేగంతో ప్రయాణించాలి. గాలి పటం తెగితే ఎగరేసిన వ్యక్తే మాంజా తొలగించాలి.ద్విచక్ర వాహనంపై ప్రయాణించేటప్పుడు ఫుల్‌హెల్మెట్ ధరించాలి. మాంజా, రోడ్డు ప్రమాదం జరిగినా కాపాడుతుంది. నిరంతరం తిరిగేవారు బైక్ హ్యాండిల్‌పై కైట్ గార్డ్‌లు అమర్చుకోవాలి.గాలిపటాలను ఎగరవేసేందుకు కాటన్, పర్యావరణ హిత దారాలు వాడటం మేలు. చైనా మాంజా వినియోగించొద్దు.రోడ్లు, విద్యుత్తు తీగలు, చెట్లు, పైవంతెనల సమీపంలో పతంగులు ఎగురవేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. రోడ్లపై మాంజా ఉంటే జీహెచ్‌ఎంసీ సిబ్బంది తొలగించాలి.చైనా మాంజా తయారీ ప్రమాదకరంగా ఉంటుందని నిపుణులు తెలిపారు. దీనిని నైలాన్, సింథటిక్ ఫైబర్ దారాలతో తయారుచేస్తారు. ఇందులో గాజుపొడి, అల్యూమినియం ఆక్సైడ్, లోహచూర్ణం, రంగులు, కృత్రిమ జిగురు మిశ్రమాన్ని పూసి ఎండలో ఆరబెడతారు. ఇలా చేయడం వల్ల తెగిపోకుండా పదునుగా ఉంటుంది. దారాన్ని గట్టిగా లాగితే చేయి తెగిపోయే పరిస్థితి. మెడలాంటి సున్నిత భాగానికి చుట్టుకుంటే గాయాల తీవ్రత ఎక్కువగా ఉంటుందని, ఒక్కోసారి తీవ్ర రక్తస్రావమై ప్రాణం పోయే ప్రమాదం ఉందని వైద్యులు పేర్కొన్నారు.తాజాగా హైదరాబాద్‌లో ఓ వ్యక్తి బైక్‌పై వెళుతుండగా అకస్మాత్తుగా మాంజా అతడి మెడకు చుట్టుకుంది. తీరా అతడు దాన్ని ఏంటని చూసే సరికే మెడ తెగిపోయింది. అటుగా వెళ్తున్న మరో వ్యక్తి దీన్ని గమనించి, వెంటనే సమీప ఆస్పత్రికి తరలించాడు. ఈ ప్రమాదంలో బాధితుడి రక్త నాళాలు కూడా తెగిపోయాయి. పండగకు ఇంకా సుమారు 10 రోజుల పైనే ఉన్నా, ఇప్పటి నుంచే వీటి ప్రమాదాలు సంభవిస్తున్నాయి.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com